ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 10.10.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్‌లో ప్రజా రవాణాను మెరుగుపరచడం సహా కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.
2. బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.
3. హైదరాబాద్ నుంచి ప్రధాన నగరాలకు హైస్పీడ్ రైలు కారిడార్ల అలైన్‌మెంట్‌పై అధ్యయనం జరుగుతోందని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి అధికారిక ప్రతిపాదనలు పంపలేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.
4. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు పర్యాటక, ఐటీ రంగాలు కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.
5. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

------------------------------------

**ముఖ్యమంత్రి**

హైదరాబాద్‌లో భవిష్యత్ అవసరాలకు తగినట్లు ప్రజా రవాణాను మెరుగుపరచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (PRT) వ్యవస్థ ఏర్పాటుపై సమీక్షించిన ఆయన, కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ సజావుగా సాగేలా వన్ వే చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. నాగార్జున సర్కిల్ ఫ్లైఓవర్ పనులను

ఏడాదిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డేటా సెంటర్లు, పరిశ్రమలలో 500 MLD రీసైకిల్డ్ వాటర్ వినియోగించేలా ప్రణాళికలు వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

డెస్క్

--------------------------------

**బతుకమ్మ**

తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ ఉత్సవాలు ఈ రోజు అమావాస్య రోజున 'ఎంగిలిపూల బతుకమ్మ'తో వైభవంగా ప్రారంభమవుతున్నాయి. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ పూల పండుగలో ప్రతిరోజు ఒక్కో విశేష పేరుతో గౌరమ్మను పూజిస్తారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై అటుకులు, ముద్దపప్పు, నానే బియ్యం, అట్ల, అలిగిన, వేపకాయల, వెన్నముద్దల బతుకమ్మల వరుసలో వేడుకలు జరుగుతాయి. ఈ నెల 18న నిర్వహించే 'సద్దుల బతుకమ్మ'తో ఈ మహోత్సవం ఘనంగా ముగుస్తుంది.

డెస్క్

-------------------------

**గవర్నర్ - బతుకమ్మ**

తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, మహిళలకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. గౌరమ్మ ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, తెలంగాణ వైభవం ప్రపంచవ్యాప్తంగా విరాజిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

డెస్క్

-------------------------

**రేవంత్ రెడ్డి - బతుకమ్మ**

బతుకమ్మ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ రాష్ట్ర ప్రజలకు, మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. పువ్వులను ఆరాధిస్తూ, ఆడబిడ్డల

ఆత్మగౌరవాన్ని, సాంస్కృతిక వైభవాన్ని చాటే ఈ పూల పండుగను తొమ్మిది రోజుల పాటు ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య ఐక్యతతో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

**డెస్క్**

--------------------------------

**రవాణా సౌకర్యాలు**

దసరా సెలవుల నేపథ్యంలో హైదరాబాద్‌లోని బస్టాండ్‌లు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. పాఠశాలలకు ప్రభుత్వం ఈ నెల 10 నుంచి 22 వరకు సెలవులు ప్రకటించడంతో రద్దీ పెరిగింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ 7 వేల ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈ నెల 18 వరకు వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడవనుండగా, 20 నుంచి 26వ తేదీ వరకు తిరుగు ప్రయాణానికి బస్సులు అందుబాటులో ఉంటాయి.

**డెస్క్**

------------------------------

**కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై సద్దుల బతుకమ్మతో ముగిసే ఈ తొమ్మిది రోజుల పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. ఈ ఉత్సవాలు ప్రతి ఇంటా సంతోషాలు, సిరిసంపదలు నింపాలని ఆయన ఆకాంక్షించారు.

**పీటీసీ - నల్గొండ**

-----------------------------

**బతుకమ్మ వేడుకలు**

రాజన్న  సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు  విద్యాసంస్థల్లో  నిన్న సాయంత్రం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వ హించారు. విద్యార్థినులు. తీరొక్క పూలతో

బతుకమ్మలు పేర్చి. పాఠశాలల ఆవరణల్లో, మైదా నాల్లో పెట్టి విద్యార్థులు, చిన్నారులు బతుకమ్మ ఆడారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

------------------------------

**తుమ్మల నాగేశ్వరరావు**

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ప్రతి డివిజన్‌లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఆయన తెలిపారు. పౌరుల భాగస్వామ్యంతోనే నగర పరిశుభ్రత సాధ్యమవుతుందని పేర్కొంటూ, ప్రజలందరూ కులమతాలకు అతీతంగా కలిసికట్టుగా జీవించాలని సూచించారు.

**పీటీసీ - ఖమ్మం**

---------------------------------

**సీఎస్**

ఎల్‌నినో ప్రభావం, వర్షపాత లోటుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరువు ప్రభావిత మండలాలపై ప్రాథమిక నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. పంటల వైవిధ్యీకరణతో రైతులను ఆదుకోవాలని, ఉపాధి హామీ (VBGRAMG) ద్వారా నీటి సంరక్షణ పనులు చేపట్టి కూలీలకు పని కల్పించాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా, కరువు నివారణకు నిధుల కొరత లేదని స్పష్టం చేశారు.

**డెస్క్**

------------------------------------

**కిషన్ రెడ్డి**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి న్యూఢిల్లీలోని రైల్వే భవన్‌లో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణె మార్గాల్లో ప్రతిపాదించిన హైస్పీడ్ రైలు కారిడార్ల అలైన్‌మెంట్‌పై అధ్యయనం జరుగుతోందని రైల్వే మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి అధికారిక ప్రతిపాదనలు పంపలేదని ఆయన వెల్లడించారు. అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే రైతులకు, రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి వివరాలు తెలియజేస్తామని స్పష్టం చేశారు.

**డెస్క్**

-----------------------------------

**భట్టి విక్రమార్క**

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు పర్యాటకం, ఐటీ రంగాలు కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. ఐటీ సీఈఓలతో సమావేశమైన ఆయన, ఎకో టూరిజాన్ని ప్రోత్సహించాలని, ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం వంటి ప్రాజెక్టులలో ఐటీ సంస్థలు భాగస్వాములై పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు.

**డెస్క్**

----------------------------------

**రాంచందర్ రావు**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా బోగస్ ఓట్లను తొలగిస్తే, వరుస ఓటములతో భయపడిన కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగ సంస్థలపై బురదజల్లుతున్నారని విమర్శించారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల ప్రజాస్వామ్యానికి జరిగే మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

డెస్క్

-----------------------------------

**కిషన్ రెడ్డి ఉప ఎన్నికలు**

ఆరు స్థానాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ సున్నా సీట్లు గెలుచుకోవడంతో రాహుల్ గాంధీ ప్రతికూల రాజకీయాలను ప్రజలు తిరస్కరించారని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ వైఫల్యాలకు రాజ్యాంగ సంస్థలను నిందించడం మాని, ప్రతికూల విధానాలను వదిలి ఓటర్లను గౌరవించడం నేర్చుకోవాలని ఆయన హితవు పలికారు.

డెస్క్

-----------------------------

**ఎస్ఐటీ వేడుకలు**

వరంగల్ ఎన్ఐటీ 68వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్డీఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జగన్నాథ్ నాయక్, దేశ రక్షణ, సాంకేతిక ప్రగతిలో విద్యార్థుల నూతన ఆవిష్కరణలు కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, పరిశోధకులు, పూర్వ విద్యార్థులకు అవార్డులను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ మాట్లాడుతూ....

**బైట్ - ఎస్ఐటీ వరంగల్ డైరెక్టర్ బిద్యాధర్**

డీఆర్డీఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జగన్నాథ్ నాయక్ మాట్లాడుతూ....

**బైట్: డా. జగన్నాథ్ నాయక్**

**పీటీసీ - వరంగల్**

-----------------------------

**వేములవాడ**

వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామివారిని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు వారికి ఘన స్వాగతం పలికి వేద ఆశీర్వచనం అందజేశారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

------------------------------------

**గుర్తింపు సంఘం ఎన్నికలు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ఆర్టీసీ డిపోల్లో గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆయా డిపోల్లో మొత్తం 426 మందికి గాను 421 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోవడంతో 98.82 శాతం పోలింగ్ నమోదైంది.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

-----------------------------

**దసరా నవరాత్రి ఉత్సవాలు**

ఆసిఫాబాద్ జిల్లాలో దసరా నవరాత్రి ఉత్సవాల దుర్గాదేవి మండపాలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎస్పీ నీతిక పంత్ సూచించారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

----------------------------

**బీఆర్ఎస్ 2కె రన్**

సూర్యాపేట జిల్లా దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా 2K రన్ నిర్వహించారు. కొత్త జిల్లాల ఏర్పాటుతోనే పాలన ప్రజలకు చేరువై, సూర్యాపేట అద్భుతమైన అభివృద్ధి సాధించిందని మాజీ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

**డెస్క్**

--------------------------------

**కాంగ్రెస్ సన్నాహక సమావేశం**

ఖమ్మంలో నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సన్నాహక సమావేశం నిర్వహించారు.

**డెస్క్**

---------------------------

**వృద్ధుల దినోత్సవం**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని కలెక్టర్ గరీమ అగర్వాల్ తెలిపారు.

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

--------------------------